
సాక్షి పల్నాడు

మంగళవారం । 14 । జనవరి । 2025



శివ ముక్కోటి పూజలు

కారెంపూడి: నగరేశ్వరస్వామి గుడిలో సోమవారం శివ ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాదిగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 564.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ నుంచి కుడి కాలువకు 9,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



డ్రోన్‌తో నిఘా

నరసరావుపేటటౌన్: అనుమానిత, నిర్మానుష్య మైన ప్రదేశాలలో డ్రోన్ నిఘా ఏర్పాటు చేసినట్లు టూ టౌన్ సీఐ హైమారావు సోమవారం తెలిపారు.

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా అమరేశ్వరునికి అన్నాభిషేకం



అమరావతి: బాల చాముండికా సమేత అమరేశ్వరునికి సోమవారం వేకువజామున మహన్యాస పూర్వక ఏకాదశ రుద్ర అన్నాభిషేకాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన అనంతరం దాతల సహకారంతో సుమారు నాలుగు క్వింటాళ్ల బియ్యాన్ని అన్నంగా వండి స్వామికి అభిషేకించారు. ఈ సందర్భంగా ఈఓ సునీల్ కుమార్ మాట్లాడుతూ ధనుర్మాసంలో అమరేశ్వరుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అన్నాభిషేకాన్ని నిర్వహించినట్టు వివరించారు. తొలుత అర్చకులు, వేద పండితులు వెంకటాద్రి నాయుని మండపంలో మహన్యాసం నిర్వహించి అనంతరం 11 రుద్రాలతో ఏకదశ రుద్రాభిషేకం, వండిన నాలుగు క్వింటాళ్ల అన్నంతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాలచాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించిన అనంతరం అభిషేకించిన అన్నాన్ని అన్నప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు.

కనుల పండువగా గోదారంగనాథ కల్యాణం



మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీ గోదా రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని గోదా రంగనాథుల అనుగ్రహాన్ని పొందారు. ఉదయం గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థ ప్రసాద గోష్ఠి జరిపారు. కార్యక్రమ నిర్వాహకులు తుల సీరామ్ దంపతులకు, నాగార్జుబాబు దంపతులకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి మంగళా శాసనాలు అందజేసినట్లు జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు తెలిపారు.

అట్టహాసంగా ప్రారంభమైన ఎడ్ల బల ప్రదర్శన



పర్చూరు (చినగంజాం): తెలుగు ప్రజల పెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో సోమవారం ఎడ్ల బండలాగుడు బల ప్రదర్శన పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 37వ జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు ఈ నెల 17వతేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు గోరంట్ల భాస్కరరావు తెలిపారు. ప్రస్తుతం సోమవారం పెద్ద సైజు విభాగంలో పోటీలు ప్రారంభం కాగా కడపటి సమాచారం అందే సమయానికి గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన పీఆర్ మెమోరియల్ ఎడ్ల జత 22 క్వింటాళ్ల బండను 25 నిమిషాలలో 4226 అడుగులు దూరం లాగి మొదటి స్థానంలో కొనసాగుతోంది. నేడు జూనియర్స్ విభాగంలో, 15వ తేదీ సబ్ జూనియర్స్ విభాగంలో, 16వ తేదీ సేద్యపు విభాగంలో, 17వ తేదీ పాలపళ్ల విభాగంతోపాటు ఆవుల అందాల పోటీలు కూడా జరుగుతాయన్నారు.

వైభవంగా శివ ముక్కోటి పర్వదినం

మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శివ ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉత్తర ద్వార దర్శన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి జేవీ నారాయణ మాట్లాడుతూ స్వామి తెల్లవారుజాము నుంచి ఉత్తర ద్వారంలో భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారన్నారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని తెలిపారు. దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఉత్సవానికి బచ్చు వెంకట ఉల్లక్కి, మాణిక్యమ్మ జ్ఞాపకార్థం మాజేటి లక్ష్మీ నరసింహ మూర్తి, లలిత దంపతులు కైంకర్యపరులుగా వ్యవహరించారని, అనంతరం స్వామికి గ్రామోత్సం నిర్వహించామని తెలిపారు.

● ప్రకృతికి ప్రణామం పలికే పండుగ



ప్రకృతికి ప్రణామం పలికే పండుగ సంక్రాంతి అని ఎస్పీ కంచి శ్రీనివాసరావు చెప్పారు. ఆయన సోమవారం రాత్రి పోలీసు కుటుంబాలతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం గతేడాది పలు విభాగాల్లో విశేష కృషి చేసిన పోలీసు సిబ్బందికి రివార్డులు, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందించారు. సతీసమేతంగా భోగి మంటను వెలిగించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) జె.వి.సంతోష్, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల డీఎస్పీలు కె.నాగేశ్వరరావు. ఎం.హనుమంతరావు, జగదీష్ పాల్గొన్నారు. –నరసరావుపేట

వసుధైక కుటుంబం.. ఆనంద తరంగం



నలుగురూ కలిస్తేనే సరదా.. కుటుంబమంతా ఉంటేనే సందడి.. అచ్చమైన సంక్రాంతి పండగ.. ఈ విషయాన్ని గుర్తించారు శావల్యాపురానికి చెందిన పాలడుగు వెంకయ్య–మాణిక్యమ్మ కుటుంబ సభ్యులు. 20 ఏళ్ల నుంచి ఆ కుటుంబంలోని నాలుగు తరాల వారంతా సంక్రాంతికి సొంతూరు తరలివస్తున్నారు. పండగ రోజుల్లో ఆనందంగా గడుపుతున్నారు. ఈ ఏడాదీ శావల్యాపురంలోని పాలడుగు విజయలక్ష్మి సారథ్యంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఈ కుటుంబ సభ్యులు 50 మంది ఇక్కడికి వచ్చి సందడి చేశారు. ఘుమఘుమలాడే వంటకాలు, వినోదాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సంతోషంగా గడిపారు. సోమవారం భోగి ఉత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. – శావల్యాపురం

భోగి భాగ్యమంట



సత్తెనపల్లిలో భోగి మంట



నందిగామలో చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న దృశ్యం



నందిగామలో హరిదాసు సందడి

సత్తెనపల్లి: తెలుగు లోగిళ్లల్లో ఇంటింటా సంక్రాంతి శోభ నెలకొంది. చిన్నా, పెద్దా ఉత్సాహంగా భోగి వేడుకలు జరుపుకున్నారు. పనికిరాని కలప, తాటి, కొబ్బరి దుంగలతో భోగి మంటను జ్వలింపజేశారు. జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామునే చిన్నారుల నుంచి పెద్దల వరకు మంగళ స్నానాలు చేసిన అనంతరం భోగిమంట వద్ద చలికాగారు. చిన్నారులు భోగి పిడకల దండలను భోగి మంటల్లో వేసి నమస్కరించారు. యువతలు ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను ఉంచి, మధ్యలో రాధాగోపాలకృష్ణ బొమ్మను ఉంచి పూజలు చేశారు. డూడూ బసవన్నల విన్యాసాలు, హరిదాసు కీర్తనలతో గ్రామాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. కొత్త అల్లుళ్లతో ఇళ్లన్నీ సందడిగా మారాయి. పలుచోట్ల చిన్నారులకు సంప్రదాయబద్ధంగా భోగి పళ్ళు, పూలు తలలపై పోసి ఆశీర్వచనాలు అందించారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించుకున్నారు.

అమరేశ్వరుని భోగిసేవ

అమరావతి: స్థానిక శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుని గుడిలో సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా సోమవారం భోగి సేవ చేశారు. అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం స్వామికి ఉదయాన్నే మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయంలో సంక్రాంతి పండుగ మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భోగి రోజున స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించారు.



అమరావతి వీధులలో అమరేశ్వరుని గ్రామోత్సవం

బీ'పచ్చ' కాండ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న అంబటి రాంబాబు, నంబూరు శంకరరావు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ మనోహర్‌నాయుడు తదితరులు

- మాజీ ఎమ్మెల్యే శంకరరావు గుంటూరు కార్యాలయంపై దాడి
- శాంతియుత పెదకూరపాడు నియోజకవర్గంలో టీడీపీ ఫ్యాక్షన్
- ఖండించిన వైఎస్సార్ సీపీ నేతలు
- శంకరరావును పరామర్శించిన మాజీ మంత్రి అంబటి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మేయర్ మనోహర్
- ఎల్లకాలం టీడీపీ అధికారంలో ఉండదని గుర్తించుకోవాలని హితవు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గుంటూరు, పల్నాడు ఎస్పీలకు వినతి
- గాయపడిన బాధితులకు ఆస్పత్రిలో పరామర్శ

లక్ష్మీపురం(గుంటూరు): ఎల్లకాలం రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటుందని అనుకోవద్దని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు హెచ్చరించారు. గుంటూరు జేకేసీ కళాశాల రోడ్డులోని పెదకూరపాడు మాజీ శాసన సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నేత నంబూరు శంకరరావు కార్యాలయంపై సోమవారం సాయంత్రం కంభంపాడు తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు కర్రలు, రాడ్లతో దాడి చేశారు. ఫ్లెక్సీలను చింపేసి అడ్డు వచ్చిన వారిని కర్రలతో, రాడ్లతో విచక్షణా రహితంగా కొట్టారు. సమాచారం అందుకున్న అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ నేతలు మందపాటి శేషగిరిరావు, పెదకూరపాడు నియోజకవర్గ పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావును పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యాలయంపై తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. గతంలో వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించడానికి వెళ్ళే సమయంలోనూ వైఎస్సార్ సీపీ వారి వాహనాలపై దాడి చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు నంబూరు శంకరరావు కార్యాలయంపై దాడి చేశారని, ఎల్లకాలం టీడీపీ అధికారంలో ఉంటుందని అనుకోవద్దని హెచ్చరించారు. పెదకూరపాడు నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో ఎన్నడూ ఎలాంటి వివాదాలు, ఘర్షణలు జరగలేదని, ఇప్పుడు కొత్తగా తెలుగు దేశం పార్టీ పెదకూరపాడు నియోజకవర్గాన్ని ఫ్యాక్షన్ నియోజకవర్గంగా మార్చాలనుకుంటుందని ధ్వజమెత్తారు. ఒక వైపు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై, సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు బనాయిస్తూనే మరో వైపు దాడులను ప్రభుత్వం పురిగొల్పుతోందని దుయ్యబట్టారు. ఇదంతా లోకేష్ ప్రోద్బలంతోనే జరుగుతోందని విమర్శించారు, రాష్ట్రంలో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, అదే టీడీపీకి భవిష్యత్తులో శాపంగా మారుతుందని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. నంబూరు శంకరరావు కార్యాలయంపై దాడి చేసిన నిందితులను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీసీ కెమెరా పుటేజ్ చూస్తే ఎవరు దాడి చేశారో స్పష్టంగా అర్థమవుతుందని చెప్పారు. దాడి చేయడానికి వచ్చిన వారిలో ఒక వ్యక్తి ద్విచక్ర వాహనం వదిలి పరారయ్యాడని, వాహనం సీజ్ చేసి ఘటనకు పాల్పడిన వారందరిపై పల్నాడు, గుంటూరు ఎస్పీలు చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళవారం ఉదయం 10 గంటలకు గుంటూరు ఎస్పీని కలిసి జరిగిన ఘటన గురించి వివరిస్తామని పేర్కొన్నారు.

ఉద్దేశపూర్వకంగానే దాడి

పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ కంభంపాడు ప్రాంతానికి చెందిన కొందరు తెలుగుదేశం పార్టీ నాయకులు ఉద్దేశపూర్వకంగానే తన కార్యాలయంపై దాడి చేశారని విమర్శించారు. ఈ దాడిలో కొందరికి గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు. ఇది అత్యంత హేయమైన చర్య అని, గత ప్రభుత్వంలో తాము అభివృద్ధి చేస్తే, ఇప్పుడు కూటమి అరాచకాలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. అనంతరం దాడిలో గాయపడి అరండల్‌పేట సాయి భాస్కర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దండంపుడి నరేంద్రసాయి, కట్టబోయిన జగదీష్, చైతన్యరెడ్డి, సిద్దు, మనోజ్, శ్రీనులను నేతలు పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

'బరి'స్తున్న పోలీసులు..
తెగిస్తున్న టీడీపీ నేతలు

- జోరుగా కోడి పందేలు
- పోలీసుల హెచ్చరికలు బేఖాతర్
- బరిని ధ్వంసం చేసినా మళ్లీ అక్కడే పందేలు




సాక్షి నెట్‌వర్క్: జిల్లా కేంద్రమైన నరసరావుపేట నియోజకవర్గంలో భోగి రోజునే కోడి పందేలు, జూదం ప్రారంభమయ్యాయి. పోలీసుల హెచ్చరికలను పట్టించుకోని టీడీపీ నాయకులు బరులు ఏర్పాటుచేసి పందేలు నిర్వహించారు. బరుల వద్ద మూడుముక్కలాట యథేచ్ఛగా సాగింది.

టీడీపీ నేతల 'బరి'తెగింపు

రొంపిచర్ల మండలంలోని కొనకంచివారిపాలెంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బరిని ఏర్పాటుచేశారు. రొంపిచర్ల ఎస్‌ఐ అశోక్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం గ్రామానికి చేరుకొని బరిని ట్రాక్టర్‌తో దున్నించి ధ్వంసం చేశారు. కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. వీటిని పట్టించుకోని టీడీపీ నాయకులు అక్కడే బరిని సిద్ధం చేసి సోమవారం కోడిపందేలు నిర్వహించారు.

యథేచ్ఛగా మద్యం అమ్మకాలు

నరసరావుపేట మండలం దొండపాడులోనూ కోడిపందేలు జరిగాయి. రెండు బరులు ఏర్పాటుచేసి టీడీపీ నాయకులు పందేలు కొనసాగించారు. బరుల వద్ద మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరిపారు. మండలంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా జూదరులు పందెంకోళ్లతో తరలివచ్చారు. పందెం బరిలో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. బహిరంగంగా కోడిపందేలు నిర్వహిస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పందేల నిర్వహణకు నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి నుంచి పోలీసులపై ఒత్తిళ్లు వచ్చినట్టు సమాచారం. పందెం నిర్వాహకుల నుంచి కూడా భారీ ఎత్తున మామూళ్లు పోలీసులకు అందినట్టు తెలుస్తోంది. కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ నేరుగా ప్రకటించినా క్షేత్రస్థాయిలో పోలీసులు ఆదేశాలను అమలు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 80, బ్యాంక్ కెనాల్‌కు 130, తూర్పు కెనాల్‌కు 193, పశ్చిమ కెనాల్‌కు 60, నిజాంపట్నం కాలువకు 50, కొమ్మమూరు కాలువకు 786 క్యూసెక్కులు విడుదల చేశారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నియామకం



నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం సోమవారం పలువురిని పార్టీ జిల్లా బాధ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చిలకలూరిపేటకు చెందిన కందుల శ్రీకాంత్‌ను యువజన విభాగ అధ్యక్షులుగాను, గురజాలకు చెందిన సిద్దాదపు గాంధీని బీసీ సెల్ విభాగ అధ్యక్షులుగాను, మాచర్లకు చెందిన కొమ్ము చంద్రశేఖర్‌బాబును ఎస్సీ సెల్ విభాగ అధ్యక్షులుగానూ, మాచర్లకు చెందిన రమావత్ రంగానాయక్‌ను ఎస్టీ సెల్, మాచర్లకు చెందిన మోర్తల ఉమామహేశ్వరరెడ్డిని వలంటీర్ విభాగం, సత్తెనపల్లికి చెందిన రోళ్ల మాధవిని లీగల్‌సెల్, వినుకొండకు చెందిన పులిచర్ల అంజిరెడ్డిని ఐటీ వింగ్ విభాగ అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వైఎస్సార్ సీపీ వలంటీర్ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నరేంద్రరెడ్డి

నరసరావుపేట: మంగళగిరి నియోజకవర్గానికి చెందిన ఆనం నరేంద్రరెడ్డి వైఎస్సార్ సీపీ వలంటీర్ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

దుర్గమ్మకు కానుకగా వెండి నివేదన పాత్ర

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గుంటూరుకు చెందిన భక్తులు సోమవారం వెండి నివేదన పాత్రను కానుకగా సమర్పించారు. గుంటూరుకు చెందిన చాయం రెడ్డి, శ్వేత, భవితలు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులను కలిసి అమ్మవారి నివేదనకు అవసరమైన వెండి పాత్రను బహూకరించారు. 2.860 కిలోల వెండితో తయారు చేయించిన పాత్రను అమ్మవారి మహా నివేదనకు వినియోగించాలని కోరారు.

క్లుప్తంగా

సంకాంత్రి ఆనందాలు పంచాలి



నరసరావుపేట: సంక్రాంతి పండుగ ప్రజల అందరి జీవితాల్లో కొత్త వెలుగులు, ఆనందాలు నింపాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇంట్లో చోరీ

పట్నంబజారు: ఇంటిలో చోరీపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట శనక్కాయల ఫ్యాక్టరీ సెంటర్‌లో నివాసం ఉండే తోకల రవి కార్పొరేషన్ పరిధిలోని సచివాలయం నంబరు– 4లో టౌన్ ప్లానింగ్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయన భార్య దేవరకొండ వెంకటశివమ్మ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తోంది. ఇద్దరూ అత్త మామలైన దేవరకొండ వెంకటరమణ, రామతులసమ్మ ఇంటిలో ఉంటున్నారు. ఈనెల 12 రాత్రి ఎప్పటిలాగే భోజనం చేసి అందరూ నిద్రించారు. వెంకటరమణకు వాష్‌రూంకు వెళ్లే అలవాటు అధికంగా ఉండటంతో కింద పోర్షన్‌లో నివాసం ఉండే ఆయన భార్య రామతులసమ్మ తలుపులు తీసి నిద్రించారు. 13వ తేదీ ఉదయం లేచి చూసేసరికి బీరువా తలుపులు తీసి ఉండటం గమనించారు. అందులోని 379 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు అపహరించుకు పోయారు.తోకల రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. తలుపులు తీసి ఉండటం, పక్కనే రైల్వే ట్రాక్ ఆనుకొని ఉండటంతో చోరీకి పాల్పడిన ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు. తెలిసిన వారే చేసి ఉంటారని అనుమానిస్తున్నారు.

గోదాదేవి కల్యాణంలో సినీ హీరో అభిరామ్

కారంచేడు: ధనుర్మాసం పురస్కరించుకొని ఆలయాల్లో నిర్వహించే గోదాదేవి కల్యాణంలో సినీ హీరో దగ్గుబాటి అభిరామ్ పాల్గొన్నారు. కారంచేడు రామాలయంలో సినీ నిర్మాత, మూవీ మొఘల్‌గా పేరొందిన మాజీ ఎంపీ దగ్గుబాటి రామానాయుడు కుటుంబ సభ్యుల ఇష్టదైవంగా భావించే రాములోరి సన్నిధిలో ఆయన మనుమడు, సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు కుమారుడు, హీరో అభిరామ్ దంపతులు గోదాదేవి కల్యాణం నిర్వహించారు.

నాటు.. నాటు.. నారు నాటు

పల్నాడు జిల్లాలో రబీ వరినాట్లు పూర్తయ్యాయి. ఈ ఏడాది కూలీల కొరత అధికంగా ఉండడంతో జిల్లా రైతులు నాట్లకు వలస కూలీలపైనే ఆధారపడ్డారు. ఇతర జిల్లాల నుంచి ముఠాలను తీసుకొచ్చి పనులు చేయించారు. 20 రోజులుగా జిల్లాలోని వేలాది ఎకరాల్లో వరినాట్లు వేశారు. నాట్ల పనులకు బెంగాల్ రాష్ట్రం నుంచీ కూలీలు రావడం గమనార్హం.

– కారంపూడి



నారు తీస్తున్న వలస కూలీలు



నాట్లు వేస్తున్న కూలీలు

సదా'వర్తిల్లేనా'!

- శిథిలావస్థలో సత్రం
- రూ.వందల కోట్ల ఆస్తులున్నా.. రక్షణేదీ?
- నిధుల్లేక మరమ్మతులకు నోచుకోని వైనం



శిథిలావస్థలో అమరావతి సదావర్తి సత్రం

అమరావతి: సదావర్తి సత్రం మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది. రూ.వందల కోట్ల ఆస్తులున్నా.. ఈ సత్రాన్ని నిధుల కొరత వెంటాడుతోంది. సుమారు 200 ఏళ్ల క్రితం రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు వంశస్తులు రాజావాసిరెడ్డి లక్ష్మీపతినాయుడు భార్య వెంకట లక్ష్మమ్మ అమరావతిలో ప్రజల ఆకలి తీర్చేందుకు సదావర్తి సత్రాన్ని నిర్మించారు. దీని నిర్వహణకు అచ్చంపేట మండలంలోని కోగంటివారిపాలెంలో 74 ఎకరాల మెట్ట భూమితోపాటు తమిళనాడు రాష్ట్రం చెన్నై సమీపంలోని 471 ఎకరాలను ఇచ్చారు. సత్రం దేవదాయ శాఖ ఆధీనంలోకి వచ్చిన నాటి నుంచి 74 ఎకరాలపై వచ్చే కౌలు ఆదాయంతోనే నిర్వహిస్తున్నారు. చెన్నై సమీపంలో ఉన్న 471 ఎకరాలపై ఎలాంటి ఆదాయం రావట్లేదు. ఈ భూమిపై హక్కు సాధనకు దేవదాయ శాఖ న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దశాబ్దాలుగా దేవదాయ శాఖాధికారుల నిర్లక్ష్యం వల్ల 471 ఎకరాల్లో మొత్తం ఆక్రమణలకు గురైంది. ప్రస్తుతం 83.11 ఎకరాలు మాత్రమే మిగిలింది.

తమిళనాడు సర్కారు వ్యాజ్యం

చెన్నై సమీపంలో ఆక్రమణలు పోనూ మిగిలిన 83.11 ఎకరాల భూమిని విక్రయించేందుకు 2016లో అప్పటి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. ఎకరాకు 50 లక్షల రూపాయల విలువ కట్టి 83.11 ఎకరాలకు 2016 మార్చి 28న చెన్నైలో బహిరంగవేలం నిర్వహించింది. గుంటూరు జిల్లాకు చెందిన ఎనిమిది మంది ఆనాటి ప్రభుత్వ పెద్దల సహకారంతో ఎకరం రూ.27లక్షల188 చొప్పున మొత్తం 83.11 ఎకరాల భూమిని 22 కోట్ల 44 లక్షల 12 వేల 625 రూపాయల అతితక్కువ మొత్తానికి దక్కించుకున్నారు. ఈ వేలంపాటలలో అవినీతి జరిగిందని ఆనాటి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) న్యాయస్థానాన్ని ఆశ్రయించటంతో కోర్టు ఆదేశాలతో మళ్లీ బహిరంగవేలం నిర్వహించారు. రెండోసారి నిర్వహించిన వేలంపాటలో ఎకరాకు 60 కోట్ల రూపాయలకు పైగా ధర పలికింది. సరిగ్గా ఇదే అదనుగా తమిళనాడు ప్రభుత్వం ఈ భూములు తమ రాష్ట్రానికి చెందినవని న్యాయస్థానంలో వ్యాజ్యం వేయటంతో వ్యవహారం మొదటికి వచ్చింది.

సత్రం పరిస్థితి దుర్భరం

సుమారు 94 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న ఈ సత్రంలో 2004 పుష్కరాలకు 10 లక్షల రూపాయల వ్యయంతో ఒక హాల్, మరుగుదొడ్లు నిర్మించారు. 2016 పుష్కరాలకు 60 లక్షల రూపాయలతో సత్రం వారసత్వ కట్టడంగా ఉండాలని 10 గదులతో పెంకుటిల్లు నిర్మించారు. మరుగుదొడ్లు, మురుగునీరు బయటకు పంపే డ్రెయినేజి వ్యవస్థ లేకపోవటంతో సత్రంలోని నిర్మాణాలన్నీ నిరుపయోగంగా మారాయి.

ఆలనపాలన చూసేదెవరూ..!

2012 నుంచి సదావర్తి సత్రాన్ని అమరేశ్వరాలయానికి దత్తత చేశారు. సత్రంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులను అమరాశ్వరాలయంలోనే నియమించడంతో పది గదులున్న సత్రాన్ని పట్టించుకునే నాథుడు లేకపోయాడు. ఈ గదులు యాత్రికులు సేద తీరటానికి యోగ్యంగా లేవు. సత్రానికి 74 ఎకరాల ద్వారా కౌలు ఆదాయం రూ.పది లక్షలు మాత్రమే వస్తుండగా, ఇది నిర్వహణకు ఏమాత్రం సరిపోవడం లేదు. ఇద్దరు పర్మినెంట్ ఉద్యోగుల వేతనాలు, శుభ్రం చేయటానికి, కరెంటు బిల్లులకు ఏటా రూ.30 లక్షలు ఖర్చవుతుందని సమాచారం. దీంతో మరమ్మతుల నిధుల్లేక సత్రం శిథిలావస్థలో ఉంది. ప్రస్తుతం సత్రంలో అన్నదానం కూడా అటకెక్కింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సత్రం జీర్ణోద్ధరణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మరి సత్రం సదా.. వర్ధిల్లేనో లేదో వేచి చూడాలి.

ప్రత్యేక నిధులు కేటాయించాలి



సదావర్తి సత్రం శిథిలావస్థకు చేరింది. దీనిని దత్తత తీసుకున్న అమరాశ్వరాలయం బాగోగులు సరిగా చూడడం లేదు. ప్రభుత్వం స్పందించి ప్రత్యేక నిధులు కేటాయించాలి

– నేరెళ్ళ హనుమంతరావు, అమరేశ్వరాలయ పాల కమండలి మాజీ సభ్యుడు, అమరావతి

దేవదాయ శాఖ నిర్లక్ష్యమే కారణం



సత్రం భూముల రక్షణలో దేవదాయ శాఖ విఫలమైంది. ఆ శాఖ నిర్లక్ష్యం వల్లే సత్రానికి ఈ దుస్థితి వచ్చింది. సత్రానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలి.

– పసుపులేటి రామనాథ్, అధ్యక్షుడు, మండల హిందూ ధర్మ రక్షా సమితి, అమరావతి

ఉన్నతాధికారులకు నివేదించాం

సత్రం శిథిలావస్థలో ఉందని దేవదాయశాఖ ఉన్నతాధికారులకు నివేదించాం. మరమ్మతులు కోసం నివేదిక సిద్ధం చేశాం. చెన్నై భూములు న్యాయస్థానంలో విచారణలో ఉన్నాయి. వాటి పరిష్కారానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నాం.

– సునీల్‌కుమార్, కార్యనిర్వహణాధికారి, అమరేశ్వరాలయం అమరావతి

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

ఈపూరు(శావల్యాపురం): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్ళ గ్రామంలో రైతుమిత్ర కమిటీ సారథ్యంలో జరుగుతున్న జాతీయ కబడ్డీ పోటీలను రెండో రోజు సోమవారం నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పోటీలు నిర్వహిస్తున్న రైతుమిత్ర కమిటీని అభినందించారు. ఢిల్లీ, హర్యానా, జమ్ముకాశ్మీర్, జార్ఖండ్, పంజాబ్ తదతర రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈనెల 17వరకు పోటీలు జరుగుతాయని కమిటీ ప్రతినిధి తల్లపనేని రామారావు తెలిపారు. పోటీలు ముగిసే వరకు క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని వివరించారు. కార్యక్రమంలో సూరె కోటేశ్వరరావు, పులి శ్రీనివాసరెడ్డి, మద్దినేని శ్రీనివాసరావు, ఇడపలపాటి హనుమయ్య, రాపర్ల జగ్గారావు, పీఈటి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆఫర్ గిఫ్టుల కోసం షాపింగ్ మాల్‌పై ప్రజల ఆగ్రహం

పిడుగురాళ్ల: సంక్రాంతి పండగ సందర్భంగా పలు వ్యాపార సంస్థలు రకరకాల ఆఫర్లు ప్రకటించడం సర్వసాధారణం. ఈ క్రమంలోనే పిడుగురాళ్ల పట్టణంలోని చెన్నై షాపింగ్ మాల్ నిర్వాహకులు రూ.1,000 నుంచి రూ. 50,000 కొనుగోలు చేసిన వస్త్రాలపై వినియోగదారులకు స్పాట్ గిఫ్ట్ ఇస్తామని ఆఫర్ ఇచ్చారు. సోమవారం సాయంత్రం గిఫ్టులు కొంత మందికి ఇస్తూ.. కొంత మందికి ఇవ్వకపోవటంతో వస్త్రాలు కొనుగోలు చేసిన మహిళలు షాపింగ్ మాల్ నిర్వాహకులను ప్రశ్నించారు. ప్రశ్నిస్తున్న వారికి మాత్రమే గిఫ్టులు ఇస్తుండడంతో మహిళలంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆఫర్ ప్రకారం అందరికీ గిఫ్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



చెన్నై షాపింగ్ మాల్ వద్ద గిఫ్టుల కోసం ప్రశ్నిస్తున్న మహిళలు

ట్రాక్టర్ రివర్స్ పోటీలు

పెదకాకాని: మండలంలోని ఉప్పలపాడులో గ్రామ పెద్దలు, మెగా గణేష్ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సోమవారం వైభవంగా జరిగాయి. ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. 40 మంది పాల్గొన్నారు. సాయంత్రం చిన్నారులకు స్లో సైకిల్, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పోటీలు నిర్వహించడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలకు తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు దంతాల అనిల్, పల్లెంపాటి సాంబశివరావు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుని ఆశయాలతోనే శాంతి సాధ్యం

శ్రీలంక బౌద్ధ బిక్షువు బోధిహిన్



భట్టిప్రోలు బౌద్ధ స్థూపం వద్ద బౌద్ధుని సూక్తులను వివరిస్తున్న శ్రీలంక బౌద్ధ బిక్షువు బోధిహిన్

భట్టిప్రోలు (కొల్లూరు): సమాజంలో శాంతి, సౌఖ్యాలు విరజిల్లాలంటే గౌతమ బుద్ధుని ఆశయాలు, సూక్తులు తప్పనిసరిగా ఆచరించాలని శ్రీలంక బౌద్ధ బిక్షువు బోధిహీన్ అన్నారు. సోమవారం భట్టిప్రోలు బౌద్ధ ఆరామాన్ని సందర్శించిన ఆయన పౌర్ణమి సందర్భంగా దీపోత్సవం నిర్వహించారు. తొలుత బౌద్ధ స్తూపం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. అనంతరం సుదర్శి మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సభలో బోధిహిన్ మాట్లాడారు. ప్రకాశం జిల్లా అడిషనల్ ఎస్పీ ఎంఎస్ఎస్. అశోక్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బుద్ధిజాన్ని స్వీకరించారని, ఆయన తరహాలోనే ప్రతి ఒక్కరూ బుద్ధిజాన్ని అలవరుచుకుంటే శాంతికాముకులవుతారన్నారు. సభ్యాక్షులు మోహనరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఏప్రాంతంలో వారైనా బుద్ధుని ఆలయం నిర్మించాలనుకుంటే తమ సంస్థ సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. బౌద్ధ స్థూపాన్ని అభివృద్ధి పరిచి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పలువురు కోరారు. కార్యక్రమంలో తుపాకుల హరిప్రసాద్, ఏవీఎస్. రాజు, ఈగ శ్రీనివాసరావు, క్రాంతి, కనుకుర్తి హరిప్రసాద్, తిరుమలశెట్టి ప్రసన్నకుమార్, బౌద్ధ ఉపవాసకులతో పాటు, బాసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.

'కళా సముద్రం'లో సత్కారం అదృష్టం




పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరించిన రాజా, సాయిమాధవ్ తదితరులు

తెనాలి: ప్రఖ్యాత రచయిత చలం అన్నట్టు తెనాలి ఓ కళా సముద్రమని, ఇంత గొప్ప ప్రదేశంలో తనకు సత్కారం జరగడం అదృష్టమని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. తనకు జరిగిన సత్కారాలు, అందుకున్న గౌరవాలన్నీ 'అరసం'కే చెందుతాయని వినమ్రంగా తెలిపారు. వామపక్ష భావజాలంతోనే తన కృషిని కొనసాగిస్తానని చెప్పారు. అరసం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటైన సభకు జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైన జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణను సత్కరించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పెనుగొండతో తనకు 48 ఏళ్లుగా పరిచయం ఉందని చెప్పారు. ఆయన వృత్తి, ప్రవృత్తి అంతా అక్షరంతోనేనని చెప్పారు. వ్యక్తిగత సాన్నిహిత్యంలో ఆయన అందరివాడుగా పేర్కొన్నారు. ప్రముఖ సినీమాటల రచయిత, అరసం అధ్యక్షవర్గ సభ్యుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ పెనుగొండ లక్ష్మీనారాయణ ఆదర్శప్రాయుడని చెప్పారు. ఆయనకు కేంద్ర సాహిత్య పురస్కారం రావటమంటే రాష్ట్రంలోని సాహిత్యకారులు అందరినీ గౌరవించినట్టుగా భావించవచ్చని అన్నారు. ఎంత గొప్ప రచయితో పెనుగొండ అంత గొప్ప మానవతావాదిగా చెప్పారు. పెనుగొండ జీవితవిశేషాలను అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ వివరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్ స్వాగతం పలికిన సభలో అయినాల మల్లేశ్వరరావు, షేక్ జానీ బాషా, ఎం.రామలింగేశ్వరుడు, కొండముది రమేష్ బాబు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

30 గొర్రెలూ మృత్యువాత



వినుకొండ: బస్సు ఢీకొని 30 గొర్రెలు, యువకుడు మృతి చెందిన ఘటన వినుకొండ రూరల్ మండలం అందుగుల కొత్తపాలెం వద్ద సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వినుకొండ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఎర్రగొండపాలెం వెళ్లి తిరుగు ప్రయాణంలో అందుగులకొత్తపాలెం వద్ద అదుపు తప్పి గొర్రెల మందపైకి దూసుకుపోయింది. ప్రమాదంలో గ్రామానికి చెందిన తిరుపతయ్య (18) ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.